


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
14 ఆగస్టు 2024
పేజీలు: 02

# కేజ్రీవాల్‌కి చుక్కెదురు

## బయటకు కష్టమే.. మధ్యంతర బెయిల్ సుప్రీం నో

### ఆ గడువు తీరిన వెంటనే తిరిగి తిహాడ్ జైలుకు..

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మధ్యంతర బెయిల్ కోసం ఆయన పెట్టుకున్న పిటిషన్ ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన ఇప్పట్లో జైలు నుంచి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మద్యం విధానం కేసులో మార్చి నెలలో అరెస్టయిన కేజ్రీ.. మధ్యలో రెండు వారాల పాటు బెయిల్ పై బయటకు వచ్చారు. అది కూడా లోక్ సభ ఎన్నికల ప్రచారం కోసం కావడం గమనార్హం. ఆ గడువు తీరిన వెంటనే తిరిగి తిహాడ్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. అయితే, ఇది జరిగి రెండు నెలుల దాటింది. దీంతో కేజ్రీ మరోసారి బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ, ఫలితం దక్కడం లేదు. కేజ్రీవాల్ పై మద్యం విధానం కేసులో తొలుత ఈడీ తర్వాత సీబీఐ కేసులు నమోదు చేశాయి. ఇప్పుడు ఆయన బెయిల్ కోరింది సీబీఐ కేసులోనే. తన అరెస్టుకు వ్యతిరేకంగా కేజ్రీ వేసిన పిటిషన్ పై సీబీఐకి నోటీసులిచ్చిన న్యాయస్థానం మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. కాగా, కేజ్రీవాల్ ను జూన్ చివరలో సీబీఐ అరెస్టు చేసింది. ఆయన సీబీఐ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. తొలుత ఢిల్లీ హైకోర్టుకు వెళ్లగా అరెస్టు చట్టబద్ధమేనని తేల్చింది. దీంతో కేజ్రీవాల్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఇక్కడా ఊరట లభించలేదు. మరోవైపు



సుప్రీం తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. కాగా, మొదటి కేసు అయిన ఈడీ కేసులో కేజ్రీవాల్ కు గత నెల 12నే మధ్యంతర బెయిల్ ఇచ్చింది. కానీ, సీబీఐ కేసులో అరెస్టు కారణంగా జైలు నుంచి విడుదల కాలేకపోయారు. వాస్తవానికి ఈడీ కేసులో బెయిల్ వస్తున్నదనే సీబీఐ జోక్యం చేసుకున్నదని ఆప్ ఆరోపణలు చేసింది. ఇప్పుడదే జరిగింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన మాజీ ఉప ముఖ్యమంత్రి, కేజ్రీవాల్ కు అత్యంత సన్నిహితుడు అయిన మనీశ్ సిసోడియాకు గత వారం బెయిల్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇదే కేసులో తిహాడ్ జైలులో ఉన్న తెలంగాణ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత కూడా బెయిల్ ప్రయత్నాల్లో ఉన్నారు. కవితకు ఈసారి తప్పకుండా బెయిల్ వస్తుందని బీఆర్ఎస్ వర్గాలు ధీమాగా ఉన్నాయి.

## ఎలన్ మస్క్, జేకే రౌలింగ్‌పై కేసు దాఖలు చేసిన వివాదాస్పద బాక్సర్



**ఎలన్ మస్క్, జేకే రౌలింగ్‌పై కేసు దాఖలు చేసిన వివాదాస్పద బాక్సర్**

పారిస్ ఒలింపిక్స్‌లో అల్జీరియాకు చెందిన మహిళా బాక్సర్ ఇమేనీ ఖాలిఫ్‌పై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. జండర్ వివాదంలో ఉన్న ఆమెపై .. బిలియనీర్ ఎలన్ మస్క్, రచయిత జేకే రౌలింగ్ కామెంట్ చేశారు. దీంతో ఆ ఇద్దరితో పాటు మరికొందరిపై బాక్సర్ ఖాలిఫ్.. కేసు బుక్ చేసింది. ఓ మ్యాచ్‌లో ఇటలీ బాక్సర్.. బౌట్ నుంచి మధ్యలోనే తప్పుకున్నది. ఖాలిఫ్‌తో షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు కూడా ఆమె నిరాకరించింది. ఆమెలో పురుష హార్మోన్లు ఉన్నట్లు ఆరోపించారు. గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ నుంచి ఆమె డిస్‌క్వాలిఫై అయ్యింది. అయితే పారిస్ ఒలింపిక్స్ సమయంలో.. ఇమేనీ ఖాలిఫ్‌పై ట్రోలింగ్ జరిగింది. మస్క్, రౌలింగ్ కూడా ఆమెను ట్రోల్ చేశారు. ఆ ఇద్దరిపై లీగల్ ఫిర్యాదు నమోదు అయినట్లు అమెరికాకు చెందిన వెరైటీ మ్యాగ్జిన్ తెలిపింది. ఇద్దరి పేర్లను లీగల్ ఫిర్యాదులో దాఖలు చేసినట్లు పారిస్‌కు చెందిన న్యాయవాది నాబిల్ బౌడీ తెలిపారు. ఈ కేసు విచారణలో ట్రంప్‌ను కూడా లాగినట్లు తెలుస్తోంది. మహిళల క్రీడల్లో పురుషులకు స్థానం లేదని అమెరికా స్విమ్మర్ రిలే గెయిన్స్ చేసిన ట్వీట్‌ను మస్క్ రీట్వీట్ చేశాడు.



## కేరళ నుంచి తొలి మహిళా ఎఫ్1 డ్రైవర్

కేరళ నుంచి తొలి మహిళా ఫార్ములావన్ రేసర్ దూసుకొచ్చింది. కోజికోడ్‌కు చెందిన సల్వా మార్జన్.. రేసింగ్‌లో అదరగొడుతున్నది. సరిగ్గా పదేండ్ల క్రితం రేసింగ్ కెరీర్ ప్రారంభించిన ఈ 25 ఏండ్ల యువ రేసర్ వచ్చే ఏడాది జనవరిలో జరిగే అంతర్జాతీయ రేసింగ్ సమాఖ్య(ఎఫ్ఐఏ) గుర్తింపు పొందిన రేసింగ్‌లో పోటీపడబోతున్నది. ప్రస్తుతం యూఏఈలో శిక్షణ తీసుకుంటున్న సల్వా ప్రస్తుతం ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నది. రేసింగ్‌లో మెరుగైన శిక్షణ కోసం అధిక మొత్తం ఖర్చు చేయాల్సి వస్తుండటంతో బిజినెస్ గ్రాడ్యుయేట్ అయిన సల్వా ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు చేయాల్సి వస్తున్నది.



## రాష్ట్రంలో మళ్లీ చంద్రన్న కానుకలు?

రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు తిరిగి చంద్రన్న కానుకలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. సంక్రాంతి కానుక, క్రిస్మస్ కానుక, రంజాన్ తోఫాలను లబ్ధిదారులందరికీ ఉచితంగా ఇస్తారు. ఇందుకు ఏటా రూ.538 కోట్లు ఖర్చు కానుంది. ఐదేళ్లకుగానూ ప్రభుత్వంపై రూ.2,690 కోట్ల అదనపు భారం పడనుంది. చంద్రన్న సంక్రాంతి కానుక కింద గోధుమపిండి, శనగపప్పు, బెల్లం, కందిపప్పు, పామాయిల్, నెయ్యి అందజేస్తారు.




## నిమ్స్‌లో హార్ట్ వాల్వ్ బ్యాంకు?

గుండె సమస్యలతో బాధపడుతున్న పేదలకు ఉచితంగా హార్ట్ వాల్వ్‌లు అందించేందుకు నిమ్స్ ముందుకొచ్చింది. ఇందుకోసం ఆస్పత్రిలో ప్రత్యేకంగా హార్ట్ వాల్వ్ బ్యాంకు ఏర్పాటు చేయనుంది. బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి గుండె కవాటాలను సేకరించి అందులో భద్రపరుస్తారు. నామమాత్రపు ఖర్చుతోనే సర్జరీ చేయించుకోవచ్చు. త్వరలో దీనిని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించనున్నట్లు సమాచారం.

## 17న ఢిల్లీకి సీఎం రేవంత్!

సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 17న ఢిల్లీ వెళ్లే ఛాన్స్ ఉంది. కొత్త పీసీసీ చీఫ్ నియామకం, క్యాబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ, ఎమ్మెల్యేల చేరికలపై ఆయన పార్టీ పెద్దలతో చర్చించనున్నారు. శ్రావణమాసంలో పీసీసీ చీఫ్ నియామకం, క్యాబినెట్ విస్తరణ పూర్తి చేయాలని ఇప్పటికే పార్టీ అగ్రనేతలు రేవంత్‌కు సూచించారు.



## హైదరాబాద్ కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బృందం విదేశీ పర్యటనను ముగించుకుని హైదరాబాద్ చేరుకుంది. అమెరికా, దక్షిణకొరియాలో సీఎంతో పాటు, మంత్రి శ్రీధర్బాబు, పలువురు అధికారులు పర్యటించారు. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ఆయా దేశాల్లో వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం బృందం సమావేశాలు నిర్వహించింది. రాష్ట్రానికి చేరుకున్న సీఎం బృందానికి శంషాబాద్ ఎయిర్పోర్టులో పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. బుధవారం సాయంత్రం కోకాపేటలో కాగ్నిజెంట్‌నూతన క్యాంపస్ను సీఎం ప్రారంభించనున్నారు.



## వినేశ్ తీర్పు వాయిదా

### ఈ నెల 16కు వాయిదావేసిన కాస్

భారత కుస్తీ యోధురాలు వినేశ్ ఫోగాట్ 'అనర్హత వేటు'పై తీర్పు మరోసారి వాయిదా పడింది. పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల ఫ్రీ స్టయిల్ విభాగంలో ఫైనల్ చేరిన వినేశ్.. సరిగ్గా తుదిపోరుకు కొన్ని గంటల ముందు నిర్దేశిత బరువు కంటే వంద గ్రాములు అధికంగా ఉండటంతో ఒలింపిక్ నిర్వాహకులు ఆమెపై అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. దీంతో సెమీస్‌లో తన చేతిలో ఓడినా ఫైనల్‌లో పోటీపడ్డ క్యూబా రెజ్లర్ లోపెజ్‌తో కలిసి తనకూ రజతం ఇవ్వాలని కోరుతూ వినేశ్.. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (కాస్)ను ఆశ్రయించింది. ఈ కేసులో గడిచిన వారం రోజులుగా వాదోపవాదాలు వింటున్న కాస్ తీర్పును ఈనెల 16కు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) మంగళవారం వెల్లడించింది. వినేశ్ కేసును వాయిదా వేయడం ఇది మూడోసారి. ఈనెల 7న ఆమె కాస్‌లో అప్పీల్ చేయగా అదే రోజు తీర్పు వస్తుందని భావించినా అది కాస్తా ఈనెల 11కు వాయిదా పడింది. ఆ తర్వాత దానిని 13 నుంచి తాజాగా మరోసారి 16కు పొడిగించడం గమనార్హం.



## రేపటి నుంచి ఆరోగ్యశ్రీ బంద్

పెండింగ్ బకాయిలు చెల్లించనందున ఆగస్టు 15 నుంచి రోగులకు ఆరోగ్య శ్రీ సేవలు కొనసాగించలేమని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ రాసింది. '2023 సెప్టెంబర్ తర్వాత బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. రూ.2,500 కోట్లు రావాల్సి ఉంది. కొత్త ప్రభుత్వం రూ.160 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఆస్పత్రుల రోజు వారీ ఖర్చులకు డబ్బులు లేవు. అందుకే సేవలు కొనసాగించలేం.' అని పేర్కొంది.



## హాట్ పోజులతో దిశా పటాని

దిశా పటానీ.. నార్త్ భామ అయిన తెలుగులో పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కిన 'లోఫర్' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైంది. ఈ మూవీ విడుదలైనపుడు ఈమె బాలీవుడ్ టాప్ స్టార్ అవుతుందని ఎవరు అంచనా వేయలేదు. మోడలింగ్ నుంచి వచ్చిన ఈ భామ.. తాజాగా 'కల్కి' మూవీతో మరోసారి బాక్సాఫీస్ దగ్గర సందడి చేసింది.దిశా పటానీ..ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని బరేలీలో పుట్టిన ఈ హాట్..నటి కాకముందు మోడల్‌గా రాణించింది. ఆ తర్వాత బాలీవుడ్ అగ్ర కథానాయికగా సత్తా చూపెడుతోంది. రీసెంట్ గా దిశా పటానీ.. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో చేసిన 'కల్కి 2898 AD' మూవీలో నటించింది. ఈ సినిమాలో ఈమె పాత్రకు పెద్దగా ప్రాధాన్యత దక్కలేదు. ఏదో ప్రభాస్ తో ఓ సాంగ్ కోసం తప్పించి దిశాకు పెద్దగా ప్రయోజనం దక్కలేదు. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'లోఫర్' మూవీతో హీరోయిన్‌గా పరిచయం అయింది దిశా పాటానీ. మోడలింగ్ బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చిన దిశా పటానీ.. ఎప్పటికపుడు హాట్ ఫోటో షూట్స్‌తో రెచ్చిపోతూ కుర్రాళ్లకు నిద్ర లేకుండా చేస్తోంది.


నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## స్వాతంత్ర్య వేడుకల్లో ఆత్మాహుతి దాడికి కుట్ర..

# ఢిల్లీలో హై అలర్ట్

దేశ రాజధాని ఢిల్లీలో భద్రతాధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఉగ్ర ముప్పు పొంచి ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించడంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. జమ్మూలోని ఓ ఉగ్ర సంస్థ నుంచి ఇద్దరు ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి పాల్పడవచ్చని నిఘా వర్గాలకు సమాచారం అందింది.కేవలం ఆగస్టు 15 నాడే ఈ దాడి జరుగుతుందని చెప్పలేమని, పంద్రాగస్టు వేడుకల సందర్భంగా భద్రత పటిష్టంగా ఉండటంతో రెండ్రోజుల తర్వాత కూడా దాడి జరిగే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. ఉగ్రవాదుల సంభాషణలను నిఘా వర్గాలు వినడంతో ఈ విషయం బయటపడింది. ఇప్పటికే పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ పంజాబ్‌లోని గ్యాంగ్‌స్టర్లు, అతివాదులు, ఉగ్రవాదులతో స్థానికంగా జరిగే స్వాతంత్ర్య వేడుకలు, అమర్‌నాథ్ యాత్రకు ఆటంకం కలిగించేలా పథకాన్ని రచిస్తున్నట్లు కూడా భద్రతా వర్గాల చెబుతున్నాయి. ఇటీవల పరిణామాలను చూస్తే కథువా, దోడా, ఉధంపూర్, రాజౌరీ, పూంఛ్ జిల్లాల్లో ఉగ్ర కదలికలున్నట్లు భద్రతా బలగాలు చెబుతున్నాయి. కాగా జమ్మూలోని దోడా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాలు ఒక ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. అత్యాధునిక ఎం4 రైఫిల్‌ను స్వాధీనం చేసుకొన్నాయి. వీటితోపాటు మూడు బ్యాక్‌ప్యాక్ బ్యాగ్‌లను ఆ ప్రాంతంలో గుర్తించారు. మంగళవారం రాత్రి ఇక్కడి అక్రా అటవీ ప్రాంతంలోని నదీ పరీవాహక ప్రాంతంలో ఉగ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య ఎన్‌కౌంటర్ మొదలైంది. అమెరికా తయారీ ఎం4 కార్బైన్‌ను ఇటీవల కాలంలో ఉగ్రవాదులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. నాటో దళాలు వాడే ఎం16ఏ2కు ఇది తేలికపాటి రకం. 2.5 కేజీల బరువు ఉంటుంది. పొట్టి బ్యారెల్‌తో వేగంగా కదలడానికి అనువైంది. 2021లో అఫ్ఘానిస్థాన్ నుంచి అమెరికా దళాలు బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను వదిలి వెళ్లిపోయారు. వాటిని పాకిస్థాన్‌లోని ఉగ్ర సంస్థలైన లష్కరే, జైషేలు తాలిబన్ల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అవి గత కొంత కాలంగా మెల్లమెల్లగా పాక్ నుంచి కశ్మీర్‌లోకి చేరుతున్నాయి.



## బ్రిటీష్ సింగర్‌తో డేటింగ్ చేస్తున్న హార్ధిక్ పాండ్యా !

భారత క్రికెటర్ హార్ధిక్ పాండ్యా.. బ్రిటీష్ సింగర్ జాస్మిన్ వాలియాతో డేటింగ్ చేస్తున్నట్లు రూమర్లు వస్తున్నాయి.ఆ ఇద్దరూ తాజాగా దిగిన ఫోటో లొకేషన్ ఒకటిగా ఉండడంతో.. వారి మధ్య రొమాన్స్ నడుస్తున్నట్లు ఊహాగానాలు వ్యాపిస్తున్నాయి. ఇటీవలే పాండ్యా మాజీ భార్య నటాషా స్టాంకోవిక్‌కు బ్రేకప్ చెప్పిన విషయం తెలిసిందే. నాలుగేళ్ల మ్యారేజ్ బాండ్‌కు జూలైలో వాళ్లు వీడ్కోలు పలికారు. అయితే గ్రీస్‌లో ఉన్న ఓ లొకేషన్ నుంచి హార్దిక్‌తో పాటు సింగర్ జాస్మిన్ ఒకే విధమైన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సింగర్ జాస్మిన్ .. బ్లూ కలర్ బికినీ.. బ్లూ షర్ట్‌తో .. ఓ పూల్ వద్ద ఫోటో దిగింది. ఆ ఫోటో బ్యాక్‌డ్రాప్‌లో మైకోనస్ సీనరి కనిపిస్తోంది. స్ట్రా హ్యాట్, ఓవర్‌సైజ్ సన్‌గ్లాసెస్‌తో ఆమె దర్శనమిచ్చింది. అయితే అదే పూల్ వద్ద ఉన్న వీడియోను హార్దిక్ పోస్టు చేశాడు. క్రీమ్ కలర్ ప్యాంట్, ప్రింట్ షర్ట్, సన్‌గ్లాసెస్‌తో హార్దిక్ వెరైటీ లుక్‌లో ఉన్నాడు. ఫోటోల్లో ఇద్దరి బ్యాక్‌గ్రౌండ్ మ్యాచ్ కావడంతో.. ఆన్‌లైన్‌లో ఫ్యాన్స్ ట్రోలింగ్ మొదలుపెట్టారు. బ్రిటీష్ సింగర్, టీవీ పర్సనాల్టీగా జాస్మిన్‌కు గుర్తింపు ఉన్నది. బ్రిటీష్ రియాల్టీ టీవీ సిరీస్ ద ఓన్లీ వే ఈజ్ ఎసెక్స్ లో నటించిన తర్వాత ఆమెకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. మరో వైపు హార్దిక్ పాండ్యా మాజీ భార్య నటాషా ప్రస్తుతం సెర్బియాలో ఉన్నది.

# వీరాంజనేయులు విహార యాత్ర రివ్యూ

వీరాంజనేయులు విహార యాత్ర, మొట్టమొదటి తెలుగు ఫ్యామిలీ రోడ్ ట్రిప్ చిత్రం. ఇది డైరెక్ట్ గా ఈటీవీ విన్ ఓటిటి ప్లాట్ ఫామ్ లో విడుదలైంది. వికె నరేష్, రాగ్ మయూర్, ప్రియా వడ్లమాని మరియు కామెడీ లెజెండ్ బ్రహ్మానందం నటించిన ఈ చిత్రం ప్రచార చిత్రాలు ప్రేక్షకులను అలరించడంతో అందరిలో ఆసక్తి ఏర్పడింది. మంచి హైప్ ను సొంతం చేసుకున్న ఈ చిత్రం అంచనాలను అందుకుందా? లేదా అనేది సమీక్షలోకి వెళ్లి చూద్దాం. గోవాలో తాను నిర్మించిన హ్యాపీ హోమ్ లో విశ్రాంతి తీసుకోవాలని కలలు కనే వీరాంజనేయులు (బ్రహ్మానందం) చుట్టూ కథ తిరుగుతుంది. దురదృష్టవశాత్తూ, తన పదవీ విరమణకి ముందే మరణించాడు. అతని కొడుకు, స్కూల్ టీచర్ అయిన నాగేశ్వరరావు (VK నరేష్) ఇంటిని అమ్మాలని ప్లాన్ చేస్తాడు, అందుకు అతని కుటుంబం సమ్మతి అవసరం. గోవాకు కుటుంబ సమేతంగా రోడ్ ట్రిప్ కి వెళ్ళడానికి ఇది కారణం అవుతుంది. ఈ నేపథ్యంలో కొన్ని విభేదాలు మరియు వ్యక్తిగత సమస్యలు తెరపైకి వస్తాయి. అయితే నాగేశ్వరరావు ఇంటిని ఎందుకు అమ్మాలనుకుంటున్నారు? అతను విజయం సాధిస్తాడా? మరి ఈ ప్రయాణం కుటుంబాన్ని ఎలా మారుస్తుంది? లాంటి ప్రశ్నలకు సమాధానాలు సినిమాలో ఉన్నాయి. ఈ చిత్రం యొక్క కథనం మిడిల్ క్లాస్ ప్రేక్షకులకి బాగా కనెక్ట్ అయ్యేలా ఉంది. నిజమైన భావోద్వేగాలు మరియు ఆలోచనాత్మకమైన డైలాగ్‌లు ఇందులో ఉన్నాయి. వికె నరేష్ తన కుటుంబాన్ని ఐక్యంగా ఉంచాలని నిర్ణయించుకున్న తండ్రిగా, వివిధ భావోద్వేగాలను సమర్థవంతంగా చూపించాడు. తన నటనతో ఆకట్టుకున్నాడు. వెటరన్ కమెడియన్ శ్రీ లక్ష్మి కూడా తన పాత్రలో అలరించింది. రాగ్ మయూర్ మరియు ప్రియా వడ్లమాని తోబుట్టువులుగా మెప్పించారు. ఈ చిత్రంలో మంచి కామెడీ ఉంది. సినిమాలోని విజువల్స్ ఆకట్టుకుంటాయి. కాన్సెప్ట్ బాగున్నప్పటికీ, సరైన విధంగా ఎగ్జిక్యూట్ చేయలేదు అని చెప్పాలి. స్టార్టింగ్ బాగానే ఉన్నప్పటికీ, సెకండాఫ్ లో అనవసరమైన సన్నివేశాలతో కథను బాగా లాగినట్లు అనిపిస్తుంది. కామెడీ మరియు ఎమోషన్స్ ను కలిపి మంచిగా చూపించడంలో దర్శకుడు తన మార్క్ మిస్సయ్యాడు. మరింత ఆకర్షణీయంగా ఉండే సన్నివేశాలను తీయడంలో విఫలం అయ్యాడు. రాగ్ మయూర్, ప్రియా వడ్లమాని, మరియు శ్రీ లక్ష్మి వంటి పాత్రలను బాగా ప్రెజెంట్ చేసి ఉండాల్సింది. ముఖ్యంగా మధ్యతరగతి ప్రేక్షకుల కోసం కొన్ని సన్నివేశాలను ఇంకా బాగా చూపించాల్సి ఉంది. క్లైమాక్స్ అర్థవంతమైన సందేశాన్ని అందిస్తుంది, కానీ ఆ సమయానికి, స్లో పేసింగ్ మరియు అనవసరమైన రొమాంటిక్ సన్నివేశాలు దాని ప్రభావాన్ని తగ్గిస్తాయి. కుటుంబ నాటకం కోసం దర్శకుడు




అనురాగ్ విజన్ మెచ్చుకోదగినది. కానీ దానిని అమలు చేయడంలో పూర్తిగా సక్సెస్ కాలేదు. అంకుర్ సి సినిమాటోగ్రఫీ ఆకర్షణీయంగా ఉంది, అయితే నరేష్ అడుపా మరియు హరి శంకర్ టిఎన్ ఎడిటింగ్ ఇంకాస్త బెటర్ గా ఉండే అవకాశం ఉంది. RH విక్రమ్ సంగీతం బాగానే ఉంది. ప్రొడక్షన్ వాల్యూస్ పర్వాలేదు. మొత్తం మీద, వీరాంజనేయులు విహార యాత్ర మంచి కథా ఆలోచనను కలిగి ఉంది. కానీ అనుకున్న విధంగా దానిని చూపించడంలో దర్శకుడు సక్సెస్ సాధించలేక పోయాడు. కథ స్లోగా సాగడం, అనవసరమైన సన్నివేశాలు సినిమా ఫలితం పై ప్రభావాన్ని చూపాయి. VK నరేష్ మరియు ఇతర నటీనటుల నటన బాగానే ఉన్నప్పటికీ, సరైన ఎమోషనల్ డెప్త్ లేకపోవడంతో ప్రేక్షకుడు కథకి కనెక్ట్ అయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది.

## నేడు రాష్ట్రవ్యాప్తంగా ఓపీ సేవలు బంద్..

# నిరసనకు దిగిన జూనియర్ డాక్టర్‌లు

రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ ఓపీ సేవలను బహిష్కరిస్తున్నట్లు జూనియర్ డాక్టర్‌లు ప్రకటించారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ బుధవారం ఓపీ సేవలకు దూరంగా ఉండనున్నట్లు జూడాలు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నోటీసులు అందజేశారు. దాంతో ఇవాళ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.కోల్‌కతాలో యువ వైద్యురాలి హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. వైద్యురాలిపై అత్యాచారానికి తెగబడిన కామాంధుడు అత్యంత పాశవికంగా వ్యవహరించాడు. బాధితురాలి మర్మాంగాలు, కళ్లు, నోటి నుంచి రక్తస్రావం, మెడ, కాళ్లు, చేతులు, గోళ్లకు గాయాలున్నట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. ఇది ఆత్మహత్య కాదని.. కచ్చితంగా లైంగిక దాడి చేసి చంపేశాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో సంజయ్ రాయ్ అనే వ్యక్తిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. అనుబంధ వాలంటీర్‌గా పనిచేస్తున్న నిందితుడు తన పోకిరి చేష్టలతో తరుచూ సదరు వైద్యురాలిని ఇబ్బందులకు గురిచేసేవాడని పోలీసుల విచారణలో తెలిసింది. కాగా వైద్యురాలి హత్యాచారాన్ని





నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బాధితురాలికి న్యాయం జరగాలనే డిమాండ్‌తో సోమవారం దేశవ్యాప్తంగా వైద్య సేవలను నిలిపివేశారు. దేశంలోని అనేక నగరాల్లోని పలు ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. అయితే అత్యవసర సేవలకు మాత్రం వైద్యులు మినహాయింపు ఇచ్చారు. ఇక ఘటన జరిగిన రోజు రాత్రి విధుల్లో ఉన్న వైద్యురాలు తన జూనియర్లతో కలిసి భోజనం చేసి, సెమినార్ రూమ్‌కి వెళ్లింది. మర్నాడు ఉదయం అక్కడ ఆమె విగతజీవిగా కనిపించింది.

# బీఎస్ఎన్ఎల్ నుంచి 5G స్మార్ట్‌ఫోన్

రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్-ఐడియాతో సహా భారతదేశంలోని ప్రైవేట్ టెలికాం కంపెనీలు జూలై 2024లో తమ ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ రీఛార్జ్ ప్లాన్‌ల ధరలను భారీగా పెంచిన విషయం తెలిసిందే. టారీఫ్ ధరలు పెంచడంతో చాలా మంది కస్టమర్ల బీఎస్ఎన్ఎల్ వైపు మళ్లుతున్నారు. ఇతర టెలికాం కంపెనీలు ధరలు పెంచినా బీఎస్ఎన్ఎల్ మాత్రం ఎలాంటి రీఛార్జ్ ధరలను పెంచలేదు. ఇప్పటికే చాలా మంది కస్టమర్ల బీఎస్ఎన్ఎల్ వైపు వెళ్లిపోయారు. ఇక కేంద్ర ప్రభుత్వం కూడా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. లక్ష టవర్లను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ 5జీ స్మార్ట్ ఫోన్‌ను తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తోందని వార్తలు వస్తున్నాయి.దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ హాట్ టాపిక్‌గా మారిన నేపథ్యంలో ఈరోజుల్లో సోషల్ మీడియాలో బీఎస్ఎన్ఎల్ గురించి కొన్ని విషయాలు పుకార్లు షికార్లు అవుతున్నాయి. దీంతో జనాలు గందరగోళానికి గురవుతున్నారు. దేనిగురించి అయినా పుకార్లు వ్యాపించాలంటే అది సోషల్ మీడియానే అని చెప్పక తప్పదు. బీఎస్ఎన్ఎల్ తన 5జీ ఫోన్‌ను త్వరలో విడుదల చేయబోతోందని, అది కూడా 200 మెగాపిక్సెల్ కెమెరా, 7000 mAh బ్యాటరీ, బీఎస్ఎన్ఎల్ సూపర్‌ఫాస్ట్ 5జీ కనెక్టివిటీ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. ఇలా 5జీ స్మార్ట్‌ఫోన్ తీసుకువస్తున్న వార్తలపై బీఎస్ఎన్ఎల్ స్పందించింది. ప్రభుత్వ టెలికాం సంస్థ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్ ద్వారా క్లారిటీ ఇచ్చింది.



## అలయ ఓవర్ హాట్ షో..

బాలీవుడ్ మోస్ట్ బ్యూటిఫుల్ అలయ ఎఫ్ తాజాగా మరోసారి అందాలతో రచ్చ చేసింది. షిమ్మరీ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో క్లీవేజ్, నడుమును ఎక్స్‌పోజ్ చేస్తూ అట్రాక్ట్ చేసింది. దీంతో అలయ ఎఫ్ లేటెస్ట్ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.ఎప్పటిలాగే.. అలయ ఎఫ్ మరోసారి తన లుక్‌తో అభిమానులను ఆకర్షించింది. ఇటీవలి చిత్రాలలో అలయ ఎఫ్ శైలి పూర్తిగా హాట్‌గా మారిపోయింది. దాంతో నెటిజన్స్ మతులు పోగొట్టుకుంటున్నారు. ఈ చిత్రాలలో అలయ ఎఫ్ మెరిసే బ్లౌజ్, ప్లీట్స్‌తో పొడవాటి స్కర్ట్‌లో చాలా హాట్‌గా కనిపిస్తోంది. దీంతో అవి వైరల్ గా మారాయి. ఈ ఫోటోలలో అలయ ఎఫ్ తన కర్వ్‌డ్ ఫిగర్‌ను ప్రదర్శిస్తూ కనిపించింది, ఈ ఫోటోలు చూసిన అభిమానులు పిచ్చోళ్లు అవుతున్నారు. క్వీన్ ఆఫ్ బ్యూటీ, స్టన్నింగ్, గార్జియస్, హాటీ, కిల్లింగ్ ఇట్ అంటూ అలయ ఎఫ్ చిత్రాలపై లక్షలాది మంది అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

